ఫ్యామిలీ డాక్టర్‌ను వినియోగించుకోవాలి: కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

గ్రామస్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు మెరుగైన, ఉత్తమ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తుందని తెలిపారు. సచివాలయాల ప్రాంగణంలో డాక్టర్ వైఎస్ఆర్ గ్రామ క్లినిక్‌లను ప్రారంచారని పేర్కొన్నారు. క్లినిక్‌లో తప్పనిసరిగా ఒక ఎంఎల్‌హెచ్‌పి, ఒక ఆరోగ్య కార్యకర్త, ఎఎన్ఎం, రెండు నుండి నలుగురు ఆశ కార్యకర్తలు ఉండేటట్లు తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు. రెండు నుండి మూడు క్లినిక్‌లకు ఒక ఆరోగ్య కార్యకర్తను కూడా నియమించినట్లు తెలిపారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా ఇద్దరు వైద్యులు ఉండేటట్టు నియామకం చేపట్టామని పేర్కొన్నారు. అవసరమైన వారికి 14 రకాల రక్త పరీక్షలు చేస్తున్నారని తెలిపారు.

ఆశావహుల్లో టెన్షన్..!

తెలుగు తమ్ముళ్లలో ఎడతెగని తర్జనభర్జన

చింతలపూడి, పోలవరం, ఉండి స్థానాలపై తీవ్ర చర్చ

జనసేన, బిజెపితో పొత్తు కుదిరితే పలు స్థానాల్లో మార్పులు

నియోజకవర్గ ఇన్‌ఛార్జీలుగా ఉన్నా టిక్కెట్‌పై టెన్షనే

పలుచోట్ల వైసిపి సిట్టింగ్ ఎంఎల్ఎలకు టికెట్లపైనా ఉత్కంఠ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికలకు ఏడాదిన్నర మాత్రమే గడువు ఉంది. దీంతో ఎంఎల్ఎ టిక్కెట్ ఆశిస్తున్న నాయకులంతా తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. నియోజకవర్గాల్లో పలు కార్యక్రమాలకు హాజరవుతూ ప్రజల్లో తిరుగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ తమకే వస్తుందనే ఆశతో అంతా ముందుకు సాగుతున్నారు. కొంతమంది నియోజకవర్గ ఇన్‌ఛార్జీలుగా ఉన్నప్పటికీ వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ వస్తుందా.. లేదా అనే టెన్షన్ మాత్రం నాయకులను వెంటాడుతోంది. ముఖ్యంగా ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి నాయకుల్లో టిక్కెట్ల టెన్షన్ నెలకొంది. అధికార వైసిపిలోనూ సిట్టింగ్ ఎంఎల్ఎలకు టిక్కెట్ ఉంటుందా.. లేక మార్పులు చోటుచేసుకుంటాయా అనే ఉత్కంఠ నడుస్తోంది. ఇప్పటికే ప్రధాన పార్టీలన్నీ వచ్చే ఎన్నికలపై దృష్టి సారించాయి. జిల్లాలో సిఎం పర్యటన జరిగిన వెంటనే టిడిపి అధినేత చంద్రబాబు సైతం మూడు రోజులపాటు దెందులూరు, చింతలపూడి, పోలవరం, కొవ్వూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో పర్యటన సాగించారు. ఈ పర్యటనలో నెలకొన్న కొన్ని పరిణామాలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. చింతలపూడి నియోజకవర్గ టిక్కెట్ ఎవరికిస్తారనే చర్చ హాట్‌టాపిక్‌గా మారింది. ఇక్కడ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిని నియమించలేదు. ఇక్కడ ఆది నుంచి టిడిపిలో గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయి. 2014 ఎన్నికల్లో ఇక్కడ టిడిపి గెలిచినా ఐదేళ్లు గ్రూపు రాజకీయాలతో ఘర్షణలు సాగుతూనే ఉన్నాయి. ఇప్పటికీ అదే పరిస్థితి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో ఎంఎల్ఎగా గెలిచి మంత్రిగా పని చేసిన పీతల సుజాత మళ్లీ చింతలపూడి టిక్కెట్ ఆశిస్తున్నారు. అదేవిధంగా మాజీ జెడ్‌పి ఛైర్మన్ కొక్కిరిగడ్డ జయరాజు టిక్కెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. వీరిద్దరూ కాకుండా గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన కీర్తిశేషులు కర్రా రాజారావు కుమారుడు కార్తీక్ టిక్కెట్ ఆశిస్తున్నట్లు చెబుతున్నారు. గతంలో కాంగ్రెస్ ఎంఎల్ఎగా పని చేసిన మద్దాల రాజేష్ టిడిపి తరపున టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఎవరికి టిక్కెట్ వస్తుందనే ఉత్కంఠ నెలకొంది. పీతల సుజాత, జయరాజు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ చంద్రబాబు పర్యటనలో స్పష్టత మాత్రం రాలేదు. పోలవరం నియోజవర్గ ఇన్‌ఛార్జిగా బొరగం శ్రీనివాస్ ఉన్నారు. ఈయనకే టిక్కెట్ అంటూ ప్రచారం సాగుతోంది. అదే తరుణంలో మాజీ ఎంఎల్ఎ మొడియం శ్రీనివాస్ సైతం చంద్రబాబు పర్యటనలో హడావుడి చేశారు. టిక్కెట్ సైతం ఆశిస్తున్నారు. దీంతో ఇక్కడ ఎవరికి టిక్కెట్ ఇస్తారనే చర్చ నడుస్తోంది. నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జిగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఉన్నారు. ఈయనతోపాటు పర్వతనేని గంగాధరం టిడిపి టిక్కెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఎవరిని టిక్కెట్ వరిస్తుందో వేచిచూడాలి. ఇక ఉండి నియోజవర్గ ఎంఎల్ఎగా మంతెన రామరాజు ఉన్నారు. ప్రస్తుతం ఉన్న సిట్టింగ్‌లకు టిక్కెట్లు ఇవ్వనున్నట్లు ఇటీవల చంద్రబాబు ప్రకటించారు. అయితే ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి శివరామరాజు ఉండి టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. దీంతో టిక్కెట్ ఎవరికిస్తారనే చర్చ నెలకొంది. కైకలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా జయమంగళ వెంకటరమణ ఉన్నారు. యాదవ సామాజిక తరగతి నుంచి విజయలక్ష్మి అనే మహిళ టిక్కెట్ ఆశిస్తుండటంతో ఇక్కడా ఉత్కంఠ నెలకొంది.

పొత్తు కుదిరితే పలుస్థానాల్లో అనూహ్య మార్పులు

టిడిపి, జనసేన, బిజెపి పొత్తుపై రకరకాల ఊహాగానాలు విన్పిస్తున్నాయి. ఈ మూడు పార్టీల నడుమ పొత్తు కుదిరితే పలు నియోజకవర్గాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకునే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు. పొత్తు కుదిరితే కైకలూరు నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ బిజెపి తరపున పోటీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. తాడేపల్లిగూడెం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వలవల బాబ్జి ఉన్నారు. టిడిపి, జనసేన పొత్తు కుదిరితే ఈ టిక్కెట్ జనసేనకు వెళ్తుందని, జనసేన అభ్యర్థిగా బొలిశెట్టి శ్రీనివాస్ పోటీచేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఉంగుటూరు నియోజవర్గంలోనూ జనసేన తరపున ధర్మరాజు పోటీ చేయనున్నట్లు చెబుతున్నారు. అదే జరిగితే గన్ని వీరాంజనేయులుకు ఇబ్బంది వచ్చే పరిస్థితి ఉంది. నరసాపురం టిక్కెట్‌ను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, కొవ్వలి నాయుడు వంటివారు ఆశిస్తున్నారు. పొత్తు కుదిరితే జనసేన తరపున బొమ్మిడి నాయకర్ పోటీచేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. భీమవరంలోనూ జనసేన పోటీచేసే పరిస్థితులు ఎక్కువగా కన్పిస్తున్నాయి. టిడిపి, జనసేన పొత్తు కుదిరితే ఎన్నికల సమయంలో టిక్కెట్ల కేటాయింపులో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటాయని రాజకీయ పరిశీలకుల అంచనా. అధికార పార్టీ వైసిపిలోనూ సిట్టింగ్ ఎంఎల్ఎలను మార్చి పలు స్థానాల్లో కొత్తవారికి అవకాశాలు దక్కనున్నట్లు ప్రచారం సాగుతోంది. పేర్లు బయటికి రాకపోయినప్పటికీ ఆ పార్టీ నాయకుల్లో మాత్రం విస్తృత చర్చ నడుస్తోంది.

రావిపాడు-మేడపాడు రోడ్డు నిర్మించాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - పోడూరు

మండలంలో రావిపాడు నుంచి మేడపాడు వెళ్లే శిథిలమైన రోడ్డును వెంటనే నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం రావిపాడులో పాదయాత్ర చేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఈ మార్గంలో ఆటో, ద్విచక్రవాహనాలపై రాకపోకలు సాగిస్తున్న గర్భిణులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి ప్రమాదం జరిగినా దానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు. వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, నేతలు అధికారి గంగాజలం, పెద్దిరాజు, బాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్‌షిప్

ఆర్గనైజింగ్ అసిస్టెంట్ కార్యదర్శి పవన్ కుమార్‌రాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8 నుంచి 11 వ తేదీ వరకు ఏడో రాష్ట్రస్థాయి సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ అసిస్టెంట్ కార్యదర్శి జివి.పవన్‌కుమార్‌రాజు తెలిపారు. స్థానిక పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాలీబాల్ క్రీడకు పుట్టినిల్లుగా ఉన్న పాలకోడేరులో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. తన తండ్రి ప్రముఖ వాలీబాల్ క్రీడాకారుడు జి.నారాయణరాజు జ్ఞాపకార్థం జిల్లా వాలీబాల్ అసోసియేషన్, పాలకోడేరు జిఎన్ఆర్, ఎస్ఎసి అండ్ ఎఎస్ఆర్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 13 మహిళ, 13 పురుష జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 450 మంది క్రీడాకారులు, మరో 150 మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు హాజరుకానున్నారని వివరించారు. ఆర్గనైజింగ్ ఉపాధ్యక్షులు వి.సుజ్ఞానరాజు మాట్లాడుతూ వాలీబాల్ నారాయణరాజు అంటే తెలియని వారు ఉండరని, ఆయన జన్మించిన ఊరిలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గ్రామ పెద్దలు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు (కోటి రాజు), గణపతిరాజు మాట్లాడుతూ వాలీబాల్ క్రీడకు పాలకోడేరు గ్రామం పెట్టింది పేరన్నారు. 50 ఏళ్ల నుంచి గ్రామంలో వాలీబాల్ క్రీడలు జరుగుతున్నాయని, దీనికి వాలీబాల్ నారాయణరాజు కృషి ఎంతో ఉందన్నారు. నారాయణరాజు వద్ద నేర్చుకున్న క్రీడాకారులు ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారన్నారు. ఇంటర్నేషనల్ వాలీబాల్ క్రీడాకారుడు ముదునూరి కృష్ణంరాజు (పండు) మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా జిల్లాలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల అనంతరం రాష్ట్రస్థాయి జట్టు ఎంపిక ఇక్కడే జరుగుతుందని తెలిపారు. అనంతరం నేషనల్ జట్టు ఎంపిక కూడా ఉంటుందన్నారు. సమావేశంలో గ్రామ సర్పంచి ఇంజేటి మరియమ్మ లక్ష్మీపతి, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, దెందుకూరి వెంకటరాజు, దాట్ల బాబు, కె.మురళీకృష్ణంరాజు, రమేష్ రాజు, గాదిరాజు రాంబాబు, వర్మ, బాలకృష్ణంరాజు, వివిఆర్.నారాయణరాజు, రామకృష్ణంరాజు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న నేతలు, గ్రామస్తులు

వ్య.కా.స రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం నవాబ్‌పాలెం అంబేద్కర్ సెంటర్లో వ్యవసాయ కార్మిక సంఘం జెండాను సంఘం రాష్ట్ర నాయకులు కండెల్లి సోమరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల స్థితిగతులు చాలా దుర్భరంగా ఉన్నాయని, వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు తప్ప వేరే పనులు లేక జీవించడమే కష్టంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. వలసలను నివారించడానికి తీసుకొచ్చిన ఉపాధి హామీని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తోందని విమర్శించారు. వ్యవసాయ కూలీల స్థితిగతులు మారాలంటే భూమి కీలకమని, అటువంటి భూ పోరాటాలే లక్ష్యంగా వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలో చర్చించి రానున్న కాలంలో భూమి కోసం, ఉపాధి కోసం కూలి రేట్ల పెంపు కోసం సమస్యల పోరాటాలకు జంగారెడ్డిగూడెంలో జరిగే మహాసభ వేదిక కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా కమిటీ సభ్యులు మండల కార్యదర్శి కండెల్లి రమేష్‌బాబు, సంఘ నాయకులు నూతంగి సూర్యారావు, నీకూరి జయరాజు, గుడాల వెంకటేశ్వరరావు, రాచర్ల నాగేశ్వరరావు, రుద్ర బోరయ్య, కండెల్లి శ్యాంబాబు, పెదముర్తి మంగరాజు, కండెల్లి విజయ, గుడాల శ్రీను, కె.కమల కుమారి పాల్గొన్నారు.

వీరవాసరం : ఈ నెల 8, 9, 10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బొబ్బనపల్లి సూర్యచంద్రరావు పిలుపునిచ్చారు. మహాసభ ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం సంఘం పతాకాన్ని నవుడూరు సెంటర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యచంద్రరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి బడ్జెట్లో నిధులు పెంచాలని తెలిపారు. 8న జంగారెడ్డిగూడెంలో జరిగే బహిరంగ సభకు బృందాకరత్, ఎ.విజయ రాఘవన్, బి.వెంకట్ హాజరుకానున్నారని తెలిపారు. ఈ సభ ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌరు సుబ్బారావు, మైగాపుల రాంబాబు, గొట్టుముక్కల శ్యాంబాబు, అయినపూడి బాబూరావు, కిలాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు

వేతన ఒప్పందం అమలు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

సివిల్ సప్లయిస్ గొడౌన్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన వేతన ఒప్పందం వెంటనే అమలు చేసి, జిఒను విడుదల చేయాలని లేనిపక్షంలో ఈ నెల 18న హమాలీ కార్మికులు సమ్మెకు వెళ్తారని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సివిల్ సప్లయిస్ గొడౌన్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు చింతకాయల బాబూరావు హెచ్చరించారు. మంగళవారం సివిల్ సప్లయిస్ గొడౌన్ హమాలీ కార్మికుల జిల్లా విస్తృత సమావేశం యూనియన్ జిల్లా కార్యదర్శి సామంతుల ఉదయభాస్కర్ అధ్యక్షతన సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడారు. కార్మికులతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకొన్న ఒప్పందం ప్రకారం 2023 జనవరి 1 నుంచి నూతన కూలి రేట్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇంతవరకూ పెరిగిన ఏరియర్ ఇవ్వకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ఏటా యూనిఫారం ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వడం లేదని, అనేక సందర్భాల్లో అధికారులకు మొరపెట్టుకున్నా పరిష్కారం కాలేదని తెలిపారు. ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న గొడౌన్ కార్మికులకు ఇఎస్ఐ అమలు చేయడం లేదని, వైద్యం ఖర్చులు పెరిగి ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరూ సంఘటితంగా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, జిల్లా నాయకులు కె.శ్రీనివాస్, నందివాడు చిన్నారావు, కె.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, పైలా శ్రీను, కొండపల్లి వెంకన్న, గుబ్బల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలి

మాజీ ఎంఎల్ఎ ఆర్ఎస్‌చే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

హైదరాబాద్ నగరంలోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఠాగూర్ ఆడిటోరియంలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ 17వ అఖిల భారత మహాసభ జయప్రదం చేయాలని ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, మాజీ ఎంఎల్ఎ ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్) పిలుపునిచ్చారు. భీమవరంలో తన స్వగృహంలో మంగళవారం ఆ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యార్థి సమస్యలపై అనునిత్యం పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ ఆలిండియా మహాసభకు దేశం నలుమూలల నుండి ప్రతినిధులు హాజరవుతారన్నారు. 13న పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్డులో జరగనున్న బహిరంగ సభలో త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షులు సుజిత్, గౌతమ్, పట్టణ కమిటీ సభ్యులు గణేష్ పాల్గొన్నారు.

సిఎస్‌తో కలెక్టర్, జెసి బేటీ

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్‌రెడ్డిని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ జెవి మురళి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతి సచివాలయంలో జవహర్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జవహర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్, జెసి

ఆయిల్‌పామ్ కార్మికుల వేదన.. అరణ్యరోదన

కనీసం గుర్తింపు కార్డులూ ఇవ్వని వైనం

కనీస వేతనాలు, ఎక్స్‌గ్రేషియా లేక విలవిల

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్

పని చేస్తేనే పూట గడిచే బతుకులు.. రైతు పండించే పంటలో 80 శాతానికిపైగా శ్రమ వీరిదే. మొక్క వేసిన దగ్గర నుండి పంట చేతికొచ్చే వరకూ రైతులకు అండగా ఉంటారు. ఇంత చేసినా ఆ శ్రమ జీవులకు మాత్రం ఎటువంటి గుర్తింపూ లేదు. వారే పామాయిల్ కార్మికులు.. ఇది ఆయిల్‌పామ్ తోటల్లో పని చేసే శ్రమ జీవుల గోడు..

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల ఉద్యాన పంటలను రైతులచే సేద్యం చేయిస్తోంది. వాటిలో పామాయిల్ సాగు ప్రధానమైంది. రాష్ట్రంలో మెట్టప్రాంతంలో, భూగర్భ జలాలు విస్తారంగా ఉన్న ప్రాంతాల్లో ఈ పంట బాగా పండుతోంది. దీని దిగుబడి మాములు ప్రాంతాల్లో పండే దానికంటే ఈ ప్రాంతంలో రెట్టింపు ఉంటుంది. సుమారు 2.57 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగవుతోంది. అతితక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, ఆదాయం వచ్చే నేపథ్యంలో రైతులు వరి సాగు స్థానంలో ఈ పామాయిల్ సాగు చేస్తున్నారు. దీనికి ఉద్యాన, ఇరిగేషన్, విద్యుత్ శాఖ పలు రాయితీలిస్తున్నాయి. పంట సాగు కోసం ఉద్యాన అనుబంధ సంస్థలు, బోర్డులు, ఏజెన్సీలు, నోడల్ ఏజెన్సీలతో పలు పథకాలను రైతులకు అందిస్తోంది. ఆయిల్‌పామ్ చట్టం-1993 ప్రకారం జాతీయ ఆహార భద్రత మిషన్, ఆయిల్‌పామ్ (ఎన్ఎఫ్ఎస్ఎం-ఎపి) ప్రకారం రాష్ట్రంలో అన్ని ఆయిల్‌పామ్ కంపెనీలు, ప్రభుత్వం ఐదు నుండి 40 సంవత్సరాలు ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు రాయితీలు కల్పిస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పంట తీసుకునేలా ఆయిల్‌పామ్ (నవభారత్, గోద్రెజ్) కంపెనీల నుంచి ముడి పామాయిల్ ఉత్పత్తిని తీసుకుంటుంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, ఫ్యాక్టరీలకు అనేక రాయితీలు కల్పిస్తోంది. మొక్క సరఫరాలో 85 శాతం సాగు చేయడానికి నాలుగు సంవత్సరాలకు 50 శాతం, తోటలో అంతర పంటలకు నాలుగు సంవత్సరాలకు 50 శాతం రాయితీలు ఇస్తుంది. బోరుబావులకు, సేద్యం కోసం మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిబంధనలు అమలు చేస్తోంది. ఈ విధంగా ఎకరాకు మూడు నుండి ఆరు టన్నుల పంట పండుతోంది. ఫ్యాక్టరీల్లో పంటకు మంచి మద్దతు ధర ఇస్తుంది. సుమారు టన్నుకు రూ.20 వేల నుండి రూ.23 వేల వరకు పలుకుతోంది. ఈ పంటలో రైతు పడే కష్టానికి రెట్టింపు ఆదాయం వస్తోంది. అయితే ఈ పంటలో పని చేసే కార్మికుల బతుకులు మాత్రం రోజురోజుకీ దయనీయంగా మారుతున్నాయి. రాష్ట్రంలో పామాయిల్ పంటను నవభారత్, గోద్రెజ్, 3ఎఫ్ వంటి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు కొనుగోలు చేస్తున్నాయి. వీటి యాజమాన్యం రైతులకు మంచి ఆదాయాన్నిస్తుండగా ఆ పంట అందించే కార్మికులకు మాత్రం మొండిచెయ్యి చూపిస్తున్నాయి. ఏలూరు జిల్లా పెదవేగి మండలంలో రైతులే ప్రభుత్వ ఆధీనంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నడుపుతున్నారు. దీనిలో సుమారు ఐదు నుండి 10 వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. చిన్న, సన్నకారు రైతుల దగ్గర నుండి భూస్వామి వరకు ఈ ఫ్యాక్టరీలో యజమానులుగా ఉన్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండి అన్నిరకాల రాయితీలు కల్పిస్తోంది. దీన్ని చూసుకుని ప్రయివేట్ ఫ్యాక్టరీలు నవభారత్, గోద్రెజ్, 3ఎఫ్ వంటి బహుళజాతి సంస్థలు రెచ్చిపోతున్నాయి. కార్మికులకు కష్టమొచ్చినా, ప్రమాదాలు జరిగినా తమకు ఎలాంటి సంబంధమూ లేదని చేతులెత్తేస్తున్నాయి.

గుర్తింపు ఇచ్చేది.. ఎప్పుడు..?

ఏళ్ల తరబడి పామాయిల్ తోటల్లో పని చేస్తున్న కార్మికులకు ఎలాంటి గుర్తింపూ లేదు. రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్‌కు, జిల్లా ఉద్యానశాఖ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా చెవిటివాని ముందు శంఖం ఊదినట్లుగా ఉంది. వేలాది మంది కార్మికులకు గుర్తింపు ఇవ్వకపోవడానికి కారణం ఏమిటీ.. ప్రయివేట్ ఫ్యాక్టరీల యాజమాన్యంపై ప్రభుత్వం ఎందుకు ఒత్తిడి తీసురావడం లేదు అనే అంశాలు కార్మికుల్లో చర్చనీయాంశమయ్యాయి. అందుకే ప్రభుత్వం స్పందించి పామాయిల్ తోటల్లో పనిచేసే కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలని పామాయిల్ కార్మిక సంఘం డిమాండ్ చేస్తోంది.

అందని కనీస వేతనం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు, వ్యవసాయ కూలీలకు, ఉపాధిహామీ కూలీలకు అనేక చట్టాలు తెచ్చాయి. అయితే నేటికీ అమలుకు నోచుకోకపోవడం సిగ్గుచేటు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కనీస వేతనం కార్మికులకు దక్కకుండా సంస్కరణలు తీసుకొస్తోంది. దీనిలో పామాయిల్ కార్మికులు బలిపశువులుగా మారారు. ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించిన కార్మికచట్టాలను దేశవ్యాప్తంగా కార్మికుల పొట్టకొట్టే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారు. దీనిలో భాగంగా కనీస వేతనాల చట్టప్రకారం నేడు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఎనిమిది గంటలు పని చేసే పామాయిల్ కార్మికునికి రూ.800 ఇవ్వాలి. ప్రస్తుతం రూ.600 ఇచ్చి రైతులు చేతులు దులుపుకుంటున్నారు. అత్యంత దారుణంగా లోడింగ్, అన్‌లోడింగ్ చేసే పురుషులకు రూ.400, మహిళలకు రూ.250 ఇస్తున్నారు. కూలీ పెంచుకోవడానికి, రాబోయే కాలంలో పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలి.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తుమ్మల సత్యనారాయణ,
పామాయిల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

జిల్లాలో సుమారు లక్షా 80 వేల ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నారు. కార్మికులు 15 వేల మందికిపైగా ఉంటారు. వీరు అనేక సమస్యలతో బాధపడుతునానరు. పామాయిల్ కార్మికులకు గుర్తింపు కార్డులివ్వడంతోపాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. తద్వారా కనీస వేతనం, ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్స్‌గ్రేషియా వంటివి అందించేలా చర్యలు చేపట్టాలి.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.అజయ్ కుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంఇఒ కార్యాలయం వద్ద సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అజయకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులపై భారాన్ని మోపిందన్నారు. నూతన విద్యా విధానం వల్ల కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఒక పక్క పనిభారం, మరో పక్క ధరల భారం, పెరగని వేతనాలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి కనీస వేతనం ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలన్నారు. వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.ప్రసాద్, జె.దుర్గ, మంగ, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నియోజకవర్గ పరిధిలో భీమవరం, వీరవాసరం మండలాలకు సంబంధించి జల జీవన్ మిషన్ పథకం రెండో విడతలో తాజాగా రూ.36 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఆయన సమీక్షించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ జల జీవన్ మిషన్‌లో భాగంగా మంజూరైన రూ.36 కోట్ల నిధులకు గాను భీమవరం మండలంలో 47 హేబిటేషన్‌లకు రూ.23.24 లక్షలు, వీరవాసరం మండలంలో 33 హేబిటేషన్లకు రూ.12.53 లక్షల మేర నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ పథకంలో మొదటి విడత కింద రూ.21 కోట్ల నిధులతో భీమవరం, వీరవాసరం మండలాలకు సంబంధించి పనులను దిరుసుమర్రులో ప్రారంభించామన్నారు. అలాగే తాగునీటికి సంబంధించి రూ.నాలుగు కోట్ల 76 లక్షల నిధులు మంజూరు కాగా వీరవాసరం మండలంలో 13 పనులు, భీమవరం మండలంలో నాలుగు పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఈ రెండు మండలాలకు సంబంధించి శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సమస్యను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ధనానంద్, జెఇలు కనకారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - ఆచంట

ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్ఐ బిఎస్‌డిఆర్.ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక కచేరీ సెంటర్లో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల కొంతవరకూ ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ ఉద్యోగాల పేరిట మోసాలు జరుగుతున్నాయని, యువతీ యువకులు ఆ బారిన పడి మోసపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యువత సైబర్ నేరాల్ల చేతిలో మోసపోతే వెంటనే పోలీసులకు గానీ 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. యువకులు మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే లైసెన్స్‌తోపాటు, వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఆర్థిక సహకారం అందిస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపకులు దాట్ల వెంకట్రాజు

దాట్ల శ్రీదేవి ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని వైసిపి నాయకులు వేగేశ్న విజయ రామరాజు అన్నారు. కాళ్ళూరు గ్రామానికి చెందిన పొన్నూరు పద్మావతి మనవరాలు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న ట్రస్ట్ వ్యవస్థాపకులు దాట్ల వెంకట్రామరాజు తన వంతు సాయంగా రూ.5 వేల నగదును మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వేగేశ్న వెంకట రామకృష్ణంరాజు, వేగేశ్న ప్రసాదరాజు, కోలా ఆంజనేయులు పాల్గొన్నారు.

బిసిలకు న్యాయం చేయాలని టిడిపి నిరసన

పాలకొల్లు: బిసిలకు జగన్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని, వారికి న్యాయం చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ ఆధ్వర్యంలో టిడిపి నేతలు, బిసిలు మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ జి.మమ్మీ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బిసిలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. ఈ సేవల్లో అక్కడకు వచ్చిన 21వ వార్డుకు చెందిన ఒంటరి మహిళ తనకు పింఛను తీసేశారని ఆవేదన వ్యక్తం చేసింది. భర్త వదిలి 10 సంవత్సరాలైంది, పెద్ద కొడుకు చనిపోయాడని వాపోయింది. రేషన్ కార్డులో భర్త పేరు ఉందని రేషన్ కార్డు ఇవ్వడం లేదని తనకు ఆత్మహత్య శరణ్యమని ఆవేదన చెందింది. తన భర్త లేదని విఆర్ఓ ధ్రువపత్రం తెలిపింది అయినా పింఛను ఇవ్వడం లేదని తహశీల్దార్ వద్ద వాపోయింది. ఆమెకు పింఛను పునరుద్ధరించాలని నిమ్మల తహశీల్దార్ మమ్మీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిసి నేతలు కర్నేన గౌరు నాయుడు, కడలి గోపి, కోడి విజయ భాస్కర్, జివి పీతల శ్రీనివాస్, పాలవలస తులసీరామ్ పాల్గొన్నారు.

కమ్మేసిన మంచు పరదా

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలో మంగళవారం తెల్లవారుజామున మంచు దుప్పటి కప్పేసింది. ఈ ఆహ్లాదకర వాతావరణంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఉదయం 8 గంటలు దాటినా మంచు తొలగక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

గొరగనమూడి ఇన్‌ఛార్జి వెల్ఫేర్ అసిస్టెంట్‌గా రాఘవ

ప్రజాశక్తి వార్తకు స్పందన

పాలకోడేరు: గొరగనమూడి సచివాలయ వెల్ఫేర్ ఇన్‌ఛార్జి అసిస్టెంట్‌గా విస్సాకోడేరు వెల్ఫేర్ అసిస్టెంట్ రాఘవను నియమిస్తూ మంగళవారం అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 5న వెల్ఫేర్ అసిస్టెంట్ విధులకు గైర్హాజరవుతోనే శీర్షికన ప్రజాశక్తి పత్రికలో వార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి మురళీ గంగాధర్ గొరగనమూడి గ్రామానికి ఇన్‌ఛార్జి వెల్ఫేర్ అసిస్టెంట్‌గా రాఘవను నియమిస్తూ పంచాయతీ కార్యదర్శి ఎ.పోలయ్యకు ఉత్తర్వులు జారీ చేశారు. విధులకు గైర్హాజరైన వెల్ఫేర్ అసిస్టెంట్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో సరళాదేవి, వెంకట రమేష్

ఘనంగా ఘంటసాల శతజయంతి

ప్రజాశక్తి - తణుకు

లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ వావిలాల సరళాదేవి, తణుకు స్వర్ణ క్లబ్, సజ్జాపురం లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఘంటసాల వెంకటేశ్వరరావు శతజయంతి సందర్భంగా మంగళవారం స్థానిక రామక్షేత్ర సేవా సమితిలో ఘంటసాల గానామృత నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమి బృందం వారిచే నగరాల్, ఇంస్పైర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం వావిలాల సరళాదేవి మాట్లాడుతూ ఎందరో గాయకులకు ఘంటసాల స్పూర్తిగా నిలిచారన్నారు. ఘంటసాల వంటి మహా గాయకుడు ప్రజల్లో స్థిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పుర ప్రముఖులు మల్లిన రామచంద్రరావు, చిటూరి రామకృష్ణ, డాక్టర్ రామబ్రహ్మం, మొదటి ఉమ డిస్ట్రిక్ గవర్నర్ గట్టి మాణిక్యాలరావు, కకరాల వేణుబాబు, డి.రంగారావు, బి.లక్ష్మీనారాయణ, కొరిపల్లి వివి సత్యనారాయణ, సజ్జాపురం స్వర్ణ క్లబ్ అధ్యక్షులు నాగజ్యోతి, సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

ఎస్‌కెఎస్‌డి విద్యార్థుల ప్రతిభ

తణుకురూరల్: ఉపాధ్యాయులు, రచయిత నేతల ప్రతాప్‌కుమార్ స్థాపించిన అంబేద్కర్ సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకుని ఈ నెల నాలుగో తేదీన నిర్వహించిన అంబేద్కర్ టాలెంట్ సెర్చ్-2022లో 220 మంది విద్యార్థులు పాల్గొనగా ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి బహుమతి రూ.3 వేలు ఎస్ ప్రవల్లిక, రెండో బహుమతి రూ.2 వేలు బి.మారుతీప్రియ, తృతీయ బహుమతి రూ.వెయ్యి బి.రమ్య అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిటూరి సత్యఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిటూరి వెంకట్సుబ్బారావు, ఎ.డి.సుబ్బారావు అభినందించారు.

టిడిపి ఆధ్వర్యాన అన్నదానం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పేదల ఆకలి తీర్చడమే టిడిపి సిద్ధాంతమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) అన్నారు. మంగళవారం స్థానిక తాలూకాఫీస్ వద్ద వలవల బాబ్జి సౌజన్యంతో 200 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ పేదలకు పట్టెడన్నం పెట్టాలనే ఉద్దేశంతో చంద్రబాబు నాయుడు అన్నా క్యాంటీన్లు ప్రారంభించారన్నారు. జగన్ పేదల కడుపు కొట్టారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గొర్రెల శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అంబేద్కర్ సేవలు ఎనలేనివి

వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు

కాళ్ల :పిహెచ్‌సి వద్ద అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - కాళ్ల

సమాజంలో ప్రతి ఒక్కరూ హక్కులు పొందే రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు అంబేద్కర్ అని, ఆయన సేవలు మరువలేనివని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ బహుజన సమైక్య వ్యవస్థాపక అధ్యక్షులు సోడదాసి గంగయ్య అన్నారు. కాళ్ల ప్రభుత్వాసుపత్రి ఆవరణలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి గులాబ్ రాజ్ కుమార్, సిరింగి బాల, తాళ్లూరి రాజకుమార్, గాతల సందీప్, బొర్ర పార్థు, అంకెం సీతారాం, గొర్ల రామకృష్ణ, కృపాదానం పాల్గొన్నారు.

ఆకివీడు : మండలంలోని పెదకాపూర్ శివారు గంటల రాయుడు పేటలో మంగళవారం జరిగిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహారాజు, జిల్లా పరిషత్ సభ్యులు వేగేసిన వెంకట్రాజు, ఎంపిపి కటారి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. టిడిపి ఆధ్వర్యంలో స్థానిక ఎనిమిదో వార్డులో నేతలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నౌకోట్ల రామారావు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బొల్లం వెంకట్రావు, గంధం ఉమా సత్యనారాయణ పాల్గొన్నారు. దుంపగడప గ్రామంలోని వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ కె.సుజాత, సిబ్బంది అంబేద్కర్‌కు నివాళులర్పించారు.

పెనుగొండ : అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పెనుగొండ సర్పంచి శ్యామల సోనియా అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. దేవలో సర్పంచి నల్లూరి సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం అంబేద్కర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచులు పాల్గొన్నారు.

పాలకొల్లు : అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాలకొల్లు అంబేద్కర్ భవన్లో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో 77వ రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో నిమ్మల 25వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ తనకు చిన్నప్పటి నుంచి అంబేద్కర్ భావజాలం అంటే ఇష్టమన్నారు. ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ మాట్లాడుతూ యువత అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలన్నారు. అనంతరం యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నేన రోజారమణి, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు జివి, కెసిచ్ పెద్దిరాజు పాల్గొన్నారు. జనసేన ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పిఎసి సభ్యులు చేగొండి సూర్య ప్రకాష్, జిల్లా సెక్రటరీ బోనం చినబాబు, జిల్లా జాయింట్ సెక్రటరీ ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొప్పిశెట్టి నాగరాజు, పోడూరు మండల అధ్యక్షులు పితాని వెంకటేష్, యాళ్ల రవీంద్రనాయుడు పాల్గొన్నారు.

పెనుమంట్ర : సచివాలయ కార్యదర్శి ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచి తాడిపత్రి ప్రియాంక మాట్లాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో అంబేద్కర్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ఎడిఆర్ డాక్టర్ ఎం.చారుమతి అధ్యక్షత వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు అంబేద్కర్ జీవిత చరిత్ర, జీవితంలో సాధించిన విజయాలు వంటి అనేక విషయాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

అత్తిలి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మక్కా సూర్యారావు ఎంపిడిఒ వివివియస్ రామారావు ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఎంపిడిఒ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ బుద్ధరతి భరణి ప్రసాద్, వైస్ ఎంపిపి సుంకర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరు సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో, ఒకటో నంబరు పాఠశాల సెంటర్ ప్రాంతాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేశారు. ఆయ కార్యక్రమాల్లో ఉపసర్పంచి బోనం నరసింహారావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. జనసేన నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ గాంధీ బొమ్మ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. టిడిపి నర్సాపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పోత్తూరి రామరాజు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.

ఆచంట : అంబేద్కర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు సుంకర సీతారామ్ ఆధ్వర్యంలో కొడమంచిలి పంచాయతీ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు, అయోధ్యలంక తదితర గ్రామ సచివాలయాల వద్ద ఆయా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు అంబేద్కర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, దిరిశాల విజయలక్ష్మి, జక్కంశెట్టి చంటి పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : అంబేద్కర్ వర్ధంతిని స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎ గ్రంథి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి ఎంఎల్‌ఎ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పాలవెల్లి మంగ, చిగురుపాటి రాజు, పిల్లి ముసలయ్య పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : అంబేద్కర్ వర్థంతి సందర్భంగా ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు స్థానిక అంబేద్కర్ సెంటర్లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతరం అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉండి : కుల రహిత సమాజ స్థాపన కర్త అంబేద్కర్ అని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. ఎన్‌ఆర్‌పి అగ్రహారంలో అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడారు. మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, బురిడీ రవిబాబు పాల్గొన్నారు.

పాలకోడేరు : పాలకోడేరులో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు) అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలకోడేరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచి ఇంజేటి మరియమ్మ అంబేద్కర్‌కు నివాళులర్పించారు. శృంగవృక్షంలో సర్పంచి జంగం సూరిబాబు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో నాయకులు కాశీ విశ్వనాథరాజు, దెందుకూరి వెంకటరాజు, లక్ష్మీపతి, నరేష్ పాల్గొన్నారు.

భీమవరం : మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

దేశం గర్వించదగ్గ వ్యక్తి అంబేద్కర్ : సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం

దేశంలో కుల వివక్ష, అంటరానితనం, నిరుద్యోగం పోవాలని నిరంతరం అంబేద్కర్ పరితపించారని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ అంబేద్కర్ భారతదేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి అన్నారు. అంబేద్కర్ కల్పించిన లౌకిక విలువలు, మత సామరస్యం, సామాజిక న్యాయం, రాజ్యాంగం వీటన్నింటినీ అందరం కాపాడుకోవాలన్నారు. దేశంలో ఉన్న భూమి, పరిశ్రమలు దేశంలోని ప్రజలందరి సొత్తుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారని, నేడు దానికి భిన్నంగా బిజెపి ప్రభుత్వం వీటన్నింటినీ కేవలం కొద్దిమంది వ్యక్తులకే కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. ఈ మతోన్మాద శక్తుల్ని ఓడించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఇన్నేళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా నేటికీ కొనసాగుతున్న కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా అందరం పోరాడాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, నాయకులు ఎం.ఆంజనేయులు, షేక్ వలీ, చైతన్య ప్రసాద్ పాల్గొన్నారు.

తణుకురూరల్ : అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సిపిఎం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, ఎ.అజయకుమారి, కామన మునిస్వామి, కె.నాగరత్నం, పి.శారద, సింగులూరి సత్యనారాయణ, ఆదినారాయబాబు, సి.సత్యవతి పాల్గొన్నారు.

పెనుమంట్ర : అంబేద్కర్ స్ఫూర్తితో మనువాదంపై ఐక్యంగా పోరాడాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ పిలుపునిచ్చారు. బ్రాహ్మణచెర్వు, జుత్తిగలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు సిఐటియు మండల కార్యదర్శి కె.ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు విజయకుమార్ మాట్లాడుతూ లౌకిక ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని మార్చి మనువాద సిద్ధాంతాలతో కూడిన రాజ్యాంగాన్ని దేశాన్ని నిర్మించాలని బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కుసంపూడి సుబ్బరాజు మాట్లాడుతూ దళితులు ఆర్థికంగా రాజకీయంగా బలపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షులు కండెల్లి కృష్ణ, రైతు సంఘం మండల కార్యదర్శి సిహెచ్ లక్ష్మీకుమారి, కె.భూషణం పండు, యు.అప్పన్న, జి.గోపి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

9న ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరావు జిల్లాకు రాక

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 9న ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు జిల్లాకు రానున్నట్లు సమాచార శాఖ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పర్యటనలో భాగంగా ఈనెల 9వ తేదీ ఉదయం 8 గంటలకు విజయవాడలో బయలుదేరి 10.30 గంటలకు తాడేపల్లిగూడెం చేరుకుని ప్రజాప్రతినిధులను కలుస్తారు. ఉదయం 11.30 గంటలకు మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియ ప్రతినిధులతో సమావేశం అవుతారు. భోజన విరామం అనంతరం తాడేపల్లిగూడెం నుండి మధ్యాహ్నం 2.00 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 3.00 గంటలకు తణుకు ఎస్‌కెఎస్‌వి ఉమెన్స్ కాలేజీలో జర్నలిజం స్టూడెంట్స్‌తో ఇంట్రాక్షన్ అవుతారు. అనంతరం సాయంత్రం 4.00 గంటలకు ఎస్‌కెఎస్‌వి ఉమెన్స్ కాలేజీ నుంచి బయలుదేరి అమలాపురం వెళతారు.

జువ్వలపాలెంలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కాళ్ల

జువ్వలపాలెంలో సిబిసిఎన్‌సి పాతపేట చర్చి గత 30 సంవత్సరాల నుంచి క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమని ఉప సర్పంచి కటారి లక్ష్మీపతి రాజు అన్నారు. జువ్వలపాలెంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జువ్వలపాలెం సెంటర్లో గ్రామ ప్రముఖులు, సంఘ పెద్దలు, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో 30 అడుగుల స్టార్‌ను ప్రారంభించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో గోకరాజు యూవరాజు, గోకరాజు వినోద్ రంగరాజు, రుద్రరాజు కృష్ణంరాజు పాల్గొన్నారు.

In The Court Of The Pril. Junior Civil Judge :: Tanuku
I.A.No. 556/2021 in O.S.No. 401/2017

Between:
Chinta Venkata Reddy & Others
...Petitioners /Plaintiffs
AND
Karri Satyanarayana Reddy (Died) & Others
...Respondents /Defendants
Proposed L.R.
5: Kovvuri Bala Santyoshi Lova Lakshmi, W/o. Sandeep Kumar, Female, age 22 Years, Pali Village, Attili Mandal TJCJC.

పిటీషనరు తరుపున దాఖలు చేసిన ప్రకటన

పై నెంబరు గ్రంథములో 1వ ప్రతివాదిని వారసులుగా చేర్చమని కోర్టు పలుమార్లు నోటీసు పంపించిననూ అవి మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున మీరు పై కోర్టు వారి ఎదుట **ది.19-12-2022వ సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, మీ తరుపు ప్లీడరు గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపర్చుకోవలెను.** లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు అని మీకు పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

గుడిమెట్ల వీర్రెడ్డి
తణుకు, అడ్వకేట్, తణుకు.
05-12-22. సెల్: 94406 07793

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి : ఏలూరు
ఇ.పి.నెం. 40/2019
ఒ.యస్.నెం. 367/2015

బిట్వీన్:
వేటుకూరి వెంకట సూర్యనారాయణ రాజు
...పిటీషనర్ /డిక్రీ హోల్డర్
మరియు
చింతలపాటి దుర్గారాణి
...రెస్పాండెంటు/ జడ్జిమెంటు డెటారు

డిక్రీ హోల్డర్ దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల ఇ.పి. వారంటు గ్రంథములో శ్రీ కోర్టు వారు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని **ది.26-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు వేలం వేయుదురు.** ఆసక్తి ఉన్న వారు సదరు వేలంలో పాల్గొనవచ్చును. పూర్తి వివరములకు డిక్రీ హోల్డర్ ప్లీడరు గారిని సంప్రదించగలరు.

షెడ్యూలు

అయిటం-1: పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, భీమడోలు సబ్ రిజిస్ట్రీ ఇలాక భీమడోలు మండలం, పూళ్ళ శివారు సాయన్నపాలెం గ్రామం దాఖలా రి.స.నెం. 1444/3 మరియు 1444/4 దాఖలా 573 1/2 చ॥గ॥ల స్థలం బ్లాక్ నెం.18లో డో.నెం. 18-99 గల ఆర్.సి.సి. బిల్డింగ్‌కు హద్దులు:
తూర్పు: ఇరిగేషన్ కెనాల్ బ్యాంక్ (మురుగు కాల్వ) -60 అ॥లు.
దక్షిణం: చింతలపాటి వెంకట సుబ్బరాజు మరియు రామచంద్రరాజు గార్ల జాయింటు చెరువు గట్టు -51 అ॥లు.
పడమర: చింతలపాటి రామచంద్రరాజు గారి స్థలం -93 అ॥లు.
ఉత్తరం: 2వ అయిటం -93 అ॥లు.
అయిటం-2: సదరు గ్రామం దాఖలా రి.స.నెం. 1444/3 మరియు 1444/7 బ్లాక్ నెం.18లో గల 124 చ॥గ॥ల స్థలంకు హద్దులు:
తూర్పు: ఇరిగేషన్ కెనాల్ బ్యాక్ (మురుగు కాల్వ) -12 అ॥లు.
దక్షిణం: 1వ అయిటం -93 అ॥లు.
పడమర: చింతలపాటి రామచంద్రరాజు గారి స్థలం -12 అ॥లు.
ఉత్తరం: కటారి కాశి విశ్వనాధరాజు గారి భూమి -93 అ॥లు.

పై హద్దుల మధ్య అనిర్థిష్టపు సగం వాటా అనగా 124 చ॥గ॥లలో 62 చ॥గ॥లు పై రెండు అయిటములు వెరశి 635 1/2 చ॥గ॥లు స్థలం అందలి ఆర్.సి.సి. బిల్డింగుతో సహా.

డిక్రీ హోల్డర్ విలువ : రూ.6,00,000/-
అమీనా విలువ : రూ.15,00,000/-

ఆవుల జగన్మోహనరావు
ఏలూరు, **పుప్పాల రామకృష్ణ**
02-12-22. అడ్వకేట్స్, ఏలూరు.

బిసిలను అణచివేయడమే ప్రభుత్వ లక్ష్యం : టిడిపి

ప్రజాశక్తి - మొగల్తూరు

రానున్న ఎన్నికల్లో టిడిపికి పట్టం కట్టి ప్రస్తుతం అనుభవిస్తున్న ఖర్మ నుంచి విముక్తి పొందేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మంగళవారం మొగల్తూరు మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు అధ్యక్షతన మొగల్తూరు పంచాయతీ పరిధి కన్నాయిగూడెంలో టిడిపి చేపట్టిన ఇదేం ఖర్మరా మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా నేతలు ఇంటింటికీ తిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. ఇసుక క్రయ విక్రయాల్లో అవినీతి చోటుచేసుకుందని విమర్శించారు. టిడిపి నియోజకవర్గ నాయకులు కొవ్వలి యతిరాజు రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. అనంతరం కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. క్లస్టర్ అధ్యక్షులుగా మాజీ ఎంపిపి కత్తిమండ ముత్యాలరావు, జోగిపండు చల్లా సుబ్రహ్మణ్యంను నియమించినట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు కలిదిండి కుమార్‌బాబు, పాలా రాంబాబు, బసవ ఏడుకొండలు పాల్గొన్నారు.

పెనుమంట్ర : రైతుల ధాన్యం కొనుగోలు పేరుతో ప్రభుత్వం డ్యూటీ చేస్తోందని, ఇదేమి ఖర్మ అని మాజీమంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. మార్టేరు వేణుగోపాలస్వామి ఆడిటోరియంలో మంగళవారం టిడిపి కార్యకర్తల సమావేశంలో వివిధ స్థాయిలో ఉన్న కార్యకర్తలకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం అంబేద్కర్ వర్ధంతి, ఇదేమి ఖర్మ రా బాబు గోడపత్రికల ఆవిష్కరణ కార్యక్రమాల్లో సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. రైతుల ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వానికి సమర్థత లేకపోతే రాజీనామా చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలన్నారు. ఈ నెల 7వ తేదీన భీమవరం కలెక్టరేట్ వద్ద జరిగే బిసి ధర్నాలో కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆచంట జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, మండల అధ్యక్షుడు కేతా మీరయ్య, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : బిసిలను జగన్ రెడ్డి ప్రభుత్వం అణచివేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నందున 'ఇదేం ఖర్మ బిసిలకు' కార్యక్రమంలో భాగంగా మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద టిడిపి నియోజకవర్గ బిసి సెల్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడారు. బిసిలకు వైసిపి ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. జిల్లా అధికార ప్రతినిధి వీరవల్లి చంద్రశేఖర్, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పడమట సోమేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి శెట్టి ప్రసాద్, వీరవాసరం మండల అధ్యక్ష కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : జగన్మోహన్ రెడ్డి పాలనలో బీసీ సామాజిక వర్గాలకు తీరని అన్యాయం జరుగుతోందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గొర్రెల శ్రీధర్ అన్నారు మంగళవారం పట్టణంలో ఇదేమి ఖర్మరా రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాలూకాఫీస్ వద్ద టిడిపి బిసి సామాజిక వర్గ నేతలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్నాల రాంపండు, కిలపర్తి వెంకటరావు, చెప్పుల వాసు, ముప్పిడి రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అండగా ఉండాలి : పివిఎల్

ప్రజాశక్తి - పాలకోడేరు

రాబోయే రోజుల్లో ప్రజలంతా వైసిపి ప్రభుత్వానికి అండగా ఉండాలని డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు అన్నారు. పెన్నాడలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎల్ గ్రామస్తులకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ వారి సమస్యలను వింటూ ముందుకు సాగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు), సర్పంచి చిల్లా అనూష సత్యనారాయణ, ఉప ఎంపిపి ఆదాడ లక్ష్మీ తులసి, నరేష్ ఎంపిటిసి ఆరేపల్లి పెద్ద వెంకటస్వామి పాల్గొన్నారు.

జిల్లా అడ్‌హాక్ కమిటీ నియామకం

ప్రజాశక్తి - ఆకివీడు



నూతన కార్యవర్గం సభ్యులు వీరే

కేంద్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన ఎపి షెడ్యూల్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు గాను జిల్లా అడ్‌హాక్ కమిటీని ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఎండిఒ కార్యాలయం వద్ద సంఘం నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కొత్త జిల్లాకు కమిటీ అధ్యక్షుడిగా ఆకివీడు ఎండిఒ (ఎఫ్‌ఎసి) ఎస్.ఎస్.శ్రీకర్ నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా భీమవరం జిఎస్‌టి ఉద్యోగి వి.రాజేష్ కుమార్, కోశాధికారిగా ఆకివీడు డిప్యూటీ తహశీల్దార్ కె.రాజకిషోర్, ఉపాధ్యక్షులుగా వి.పూర్ణ బాబ్జి, సంయుక్త కార్యదర్శులుగా జె.ఏసుబాబు, ఎండబ్ల్యూహెచ్ పల్సన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సిహెచ్ రాజేష్‌ను నియమించినట్లు శ్రీకర్ తెలిపారు. వీరితోపాటు జిల్లా ఎన్నికల నిర్వహణకు గాను న్యాయ సహాయకులుగా సలహా మండలిని సైతం రాష్ట్ర కార్యవర్గం ప్రకటించింది. జిల్లా కార్యవర్గ ప్రధాన సలహాదారుగా కేసిరాజు, న్యాయ సలహాదారుగా న్యాయవాది ఎం.భాస్కరరావును నియమించారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

నరసాపురం: అంబేద్కర్ వర్ధంతి నిర్వహించడానికి ఆయన విగ్రహం వద్ద అడ్డుగా ఉన్న ఇసుక మేటను తొలగించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు కృష్ణవల్లి రాజేష్ డిమాండ్ చేశారు. వైన్ కళాశాల ఎదురు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఇసుక మేటు వేశారని, ఇసుక కాంట్రాక్టర్ దుర్గారావుకు మూడు రోజుల క్రితమే ఇసుకను తొలగించాలని చెప్పినా పట్టించుకోలేదని మంగళవారం మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ దళితుడు అనే చిన్నచూపుతోనే ఇలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తక్షణం కాంట్రాక్టర్‌పై, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కర్ణ జోగయ్య, అధ్యక్షులు గుండు నగేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు సరళ శ్రీను పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు

మొగల్తూరు: మొగల్తూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ అధికారులు తనిఖీలు చేశారు. ఇటీవల చోటు చేసుకున్న నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లపై సమగ్రంగా తనిఖీలు చేయాల్సిందిగా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు పోడూరు తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు, ఆచంట తహశీల్దార్ ఎండి నజీముల్లాషా, యలమంచిలి తహశీల్దార్ ఎల్.నరసింహారావు, మొగల్తూరు ఇన్‌ఛార్జి తహశీల్దార్ నరేష్ కుమార్ రికార్డులు పరిశీలించారు.

NOTICE FOR ISSUE OF DUPLICATE SHARE CERTIFICATES
JEEVAN SCIENTIFIC TECHNOLOGY LIMITED
Plot No. 1&2, SaiKrupa Enclave, Near Lanco Hills, Golconda Post, Hyderabad - 500008 (TS)

Notice is hereby given that the Original Share Certificates details of which are furnished hereunder, have been reported lost/misplaced and pursuant to request received from the Registered Shareholder, the Company intends to issue Duplicate Share Certificates against the said Original Share Certificates after completion of the requisite formalities under the provisions of Companies Act 1956 / SEBI Guidelines.

Folio No.	Name	Cert.No	Dist.Nos	No.of Shares
JSL000205	Ravindra Ginjupalli	219	1801601-1821600	20000

Any person, having objection for the proposed issue of Duplicate Share Certificates, may submit the same in writing with valid reasons to the Company at its Registered Office within 15 days from the date of publication of this Notice. The public is hereby cautioned against purchasing / dealing in the aforementioned Share Certificates.

It is further notified that the Company would proceed for issue of Duplicate Share Certificates, if no valid objection is received within the stipulated time hereof.

Place : Hyderabad. ***Authorised Signatory***